క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


దివ్య

ఖానాపురం : వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని మంగళవారిపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారిపేటకు చెందిన దివ్య ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లేదు. దీంతో తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిస్తే 87124 85234కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

భగీరథ పైపులైన్ లీకేజీ


లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీరు

నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేట రోడ్డులో గల భగీరథ పైపులైన్ లీకేజితో తాగునీరు వృథాగా పోతుంది. నర్సంపేట పట్టణం ద్వారకపేట రోడ్డులో గల పుట్ట రామస్వామి ఇంటి ఎదురుగా గల మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో ఇంటి ఎదుట నీరు చేరుతుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.

ఇంటింటా జెండాల పంపిణీ



దుగ్గొండి : శ్రీసీతారాముల కల్యాణ వేడుకల సందర్భంగా మండలంలోని గిర్నిబావిలో బీజేవైఎం కార్యకర్తలు మంగళవారం ఇంటింటికి ఓం ముద్రిత జెండాలను పంపిణీ చేశారు. శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు ఈర సందీప్, జగదీశ్, లింగన్న, వెంకటరెడ్డి, శ్రీనివాస్, నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీగా సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి

● పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి


మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం హనుమకొండలోని తన నివాసంలో గీసుకొండ మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మారెడ్డి మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు కష్టపడుతున్నా పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓటు వేయాలని కోరాలన్నారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందని, సీఎం రేవంత్ మాటలను నమ్మి మోసపోవద్దని, తనకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

ముస్తాబైన ఆలయాలు

చెన్నారావుపేట : సీతారాముల కల్యాణ వేడుకలకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం నిర్వహించనున్న శ్రీరామ నవమికి ఆలయ కమిటీ బాధ్యులు దేవాలయాల వద్ద చలువ పందిళ్లు వేయించి ముస్తాబు చేశారు. భక్తులు వేడుకలకు హాజరై సీతారాముల ఆశీస్సులు పొందాలని హనుమాన్ ఆలయ కమిటీ బాధ్యులు మహేందర్ రెడ్డి, విజయరామరాజు, తోట రాము, రాజేష్, శ్రీను, కిరణ్ కోరారు.

బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీల ఎన్నిక

ఐనవోలు : మండల కేంద్రంతోపాటు పెరుమాండ్లగూడెంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లుగా మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు మంగళవారం తెలిపారు. ఐనవోలు గ్రామాధ్యక్షుడిగా తాటికాయల కుమార్, ప్రధానకార్యదర్శిగా కాటబోయిన అశోక్, యూత్ అధ్యక్షుడిగా బరిగెల అనిల్, పెరుమాండ్లగూడెం అధ్యక్షుడిగా కోల సంపత్, ప్రధానకార్యదర్శిగా వరంగంటి రాములు ఎన్నికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, పంథిని ఎంపీటీసీ సోమేశ్వర్ రావు, మాజీ సర్పంచ్‌లు సురేష్, సదానందం, నాయకుడు లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

రెండు పూటలా 'ఉపాధి'

● ఉదయం, సాయంత్రం పనులకు వస్తున్న కూలీలు
● రోజుకు 4వేల మంది హాజరు


మందపల్లి చెరువులో ఉపాధి హామీపనులు చేస్తున్న కూలీలు

దుగ్గొండి : వేసవికాలం దృష్ట్యా ఎండలు మండుతున్నాయి.. భానుడి భగభగకు జనం అల్లాడుతున్నారు. బయటికి వెళ్లిన వారు వడదెబ్బకు గురవుతున్నారు. ఇందుకు తోడు వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు మండుటెండను చూసి పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులు మందగించాయి. గతంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉపాధి పనులు చేసేవారు. అయితే ఎండలు తీవ్రమవడంతో కూలీలు భయపడి పనికి రావడం లేదు. దీంతో దుగ్గొండి మండలంలోని పలు గ్రామాల్లో సాయంత్రం పూట ఉపాధి పనులకు శ్రీకారం చుట్టారు. 16 ఏళ్ల తర్వాత ఉపాధిహామీ పథకంలో ఉదయం, సాయంత్రం పనులు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

ఒక్కరోజే 4,000 మంది హాజరు..

తిమ్మంపేట, మందపల్లి, గిర్నిబావి, పీజీతండా గ్రామాల్లో ఉదయం, సాయంత్రం పూట ఉపాధి హామీ పనులు చేపట్టారు. కూలీలు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు.. మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. సాయంత్రం ఉపాధి పనులు ప్రారంభించడంతో కూలీల నుంచి అనూహ్య స్పందన వస్తుంది. మంగళవారం ఒక్కరోజే మండల వ్యాప్తంగా 4,000 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. ఉత్సాహంగా చెరువు మట్టిని ట్రాక్టర్లలో రైతుల పొలాలకు తరలించడం, వరదనీటి మళ్లీంపు కాల్వల నిర్మాణ పనులు చేపట్టారు.

పనులను సద్వినియోగం చేసుకోవాలి



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. కొలతల ప్రకారం రూ.300లకు తగ్గకుండా వేతనం అందుతుంది. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం..సాయంత్రం వేళ పనులు చేసుకునే అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. చెరువులో నల్లమట్టిని రైతులు తమ పంట పొలాలకు తరలించుకుంటే భూసారం సైతం పెరిగి మంచి పంటలు పండించొచ్చు.

– శ్రీనివాస్, ఏపీఓ

యువత వ్యసనానికి బానిసకావొద్దు

● సీఐ చంద్రమోహన్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ చంద్రమోహన్

నెక్కొండ : యువత మత్తు పదార్థాలు, వ్యసనానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ చంద్రమోహన్ అన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల వినియోగంపై వచ్చే అనర్థాలతో రూపొందించిన అవగాహన వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజల సహకారం ఉండాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కళాశాలలు, రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్, ఆటో స్టాండ్, ప్రతి గ్రామంలోని ప్రధాన కూడలల్లో వాల్ పోస్టర్లను అతికించామని పేర్కొన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేసినా, సేవించినా లేదా పండించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి


తాగునీటి బావిని పరిశీలిస్తున్న గోవిందరాజన్

నల్లబెల్లి : వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి గోవిందరాజన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నల్లబెల్లి, రుద్రగూడెం, మేడపల్లి, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి తాగునీటి సరఫరాను పర్యవేక్షించారు. ఆయా గ్రామాల్లో మంచినీటి సరఫరా బావులను పరిశీలించారు. నీటి సరఫరాలో సమస్యలను ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో తాగు నీటి సరఫరాలో సమస్య తలెత్తిన గ్రామాల్లో ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి కాలం ముగిసే వరకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీరు వృథా చేయవద్దని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు పద్మనాభస్వామి, రంజిత్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ నర్సయ్య

వర్ధన్నపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్లో వర్ధన్నపేట పోలీసులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఏసీపీ నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా పాదాచారులకు, ప్రయాణికులకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అందులో భాగంగానే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాదాచారులు దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వేసవి కాలంలో తగు జాగ్రత్తలతోనే బయటకు రావాలని సూచించారు. వేసవి తాపం వల్ల అస్వస్థతకు గురయ్యే ప్రమాదముందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐ సూర్యప్రకాష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహించొద్దు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ స్వరూప

వర్ధన్నపేట : వర్ధన్నపేటతోపాటు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో అనుమతి లేకుండా ఎలాంటి మద్యం బాటిళ్లు నిల్వ చేసినా, విక్రయాలు జరిపినా బెల్ట్ దుకాణాలు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప హెచ్చరించారు. మంగళవారం ఎక్సైజ్ సీఐ విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో, మండల కేంద్రాల్లో, పట్టణంలో ఎట్టి పరిస్థితుల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహించొద్దన్నారు. అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వచేసి దాడుల్లో పట్టుబడిన వ్యక్తులు మరోమారు పట్టుబడితే పీడీయాక్టు కింద కేసు నమోదు చేస్తామన్నారు. బైండోవర్ అయిన వ్యక్తులు మద్యంతో పట్టుబడితే వారి వద్ద నుంచి రూ. లక్ష వరకు జరిమానా విధించడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'దొడ్డ' భవనాన్ని పాఠశాలకు కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డ మోహన్‌రావు ఇరిగేషన్ శాఖకు అప్పగించిన భవనాన్ని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్వహణకు కేటాయించాలని భారత చైతన్య యువజన జ్యోతిరావు పూలే వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, యువజన సంఘాల సమైక్య జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చిక రాజుగౌడ్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని 13వ వార్డులో దొడ్డ మోహన్‌రావుకు చెందిన ఇంటిని నీటి పారుదల శాఖ కార్యాలయానికి అప్పటి జిల్లా కలెక్టర్ పత్రాలు, ఇంటి తాళాలు అందజేశారు. అప్పటి నుంచి ఆ భవనం నీటి పారుదల శాఖ ఉపయోగించడం లేదు. మోహన్‌రావు స్థలం, భవనం వృథా కాకుండా పేద, బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యా కేంద్రంగా నెలకొల్పేలా మహాత్మా జ్యోతిరావు పూలే భవనంగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనతా యూత్ అధ్యక్షుడు శ్రీరామోజు మురళి, బీసీవై జ్యోతిరావుపూలే వేదిక జిల్లా నాయకులు గుడికందుల సనత్‌కుమార్, పూలే వేదిక జిల్లా నాయకులు పైండ్ల గగన్‌కుమార్, మార్షల్ యూత్ కన్వీనర్ బల్ల శివ, వివిధ బీసీ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పీఏసీఎస్ చైర్మన్ల రాజీనామా

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఆకుల రమేష్ మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ తరఫున పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికై నాలుగేళ్లు అవుతున్నప్పటికీ పార్టీలో కనీసం ప్రోటోకాల్ లేకపోవడం, పలు మీటింగ్‌లలో అవమానం జరగడం, సీసీరోడ్ల ప్రారంభోత్సవంలో శిలాఫలకంలో పేరు లేకపోవడం వంటి విషయాలు పలుమార్లు పార్టీలో చెప్పిన ఎవరు పట్టించుకోవడంలేదు, దీంతో మనస్తాపానికి గురై బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

మందపల్లి పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి..

దుగ్గొండి : మండలంలోని మందపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గుడిపెల్లి శ్రీనివాసరెడ్డి మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి లేఖ రాశారు. రైతులకు సేవ చేయాలనే సంకల్పంతో తాను బీఆర్ఎస్‌లో చేరానని, చైర్మన్‌గా అవకాశం కల్పించిన సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకుల గ్రూపు తగాదాలతో తాను ఇబ్బంది పడ్డానని, 4 నెలలుగా పార్టీలో గుర్తింపు లేక పోవడం నన్ను కలిచి వేసిందని, జెండా మోసి గెలిపించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని లేఖలో పేర్కొన్నారు.

బీజేపీతోనే దేశంలో సుపరిపాలన

● ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్


వర్ధన్నపేటలో ప్రచారం చేస్తున్న కొండేటి శ్రీధర్ తదితరులు

వర్ధన్నపేట: బీజేపీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యమని, ప్రధాని నరేంద్రమోదీ భారత్‌కు ప్రపంచంలోనే గుర్తింపు తెచ్చారని పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం వర్ధన్నపేట పట్టణంలో కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. ఇందులో భాగంగా కరపత్రాలను పంపిణీ చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో బలోపేతం కావడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల పార్టీలు అవినీతి, అక్రమాలతోనే పాలన చేశాయని విమర్శించారు. నరేంద్రమోదీ నాయకత్వంలో తిరిగి బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి అనిత సత్యం, గిరిప్రసాద్, విక్కి, దినేష్, వేణు, గణేష్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం


గీసుకొండ : 15వ డివిజన్‌లో..

గీసుకొండ : మండలంలోని మొగిలిచర్ల, గోపాల్ రెడ్డి నగర్, పోగుల ఆగయ్య నగర్‌లలో పోలింగ్ బూత్‌ల వారీగా బీజేపీ నాయకులు కేంద్రంలోని ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను మంగళవారం ప్రచారం చేశారు. అలాగే వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు ఓటు వేయాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు బిల్లా రమేశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆడెపు రమేశ్, కామగోని రఘుపతి, లెంకలపెల్లి స్వామి, కూనమల్ల రవి, గనిపాక స్వామి, రాదారపు మల్లికార్జున్, సమతాబాజీ రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వర్ధన్నపేట : అనుకోని పరిస్థితుల్లో ఆస్పత్రులో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. రోగులను రక్షించి, ఎలా బయటికి తీసుకురావాలనే అంశంపై మంగళవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డివిజన్ అగ్నిమాపక అధికారి భద్రయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ డ్రిల్ అండ్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణ నిర్వహించారు. ప్రమాదాలకు గురైన వారిని రక్షించడం, ప్రాథమిక చికిత్సపై వర్ధన్నపేట అగ్నిమాపక అధికారి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న ఎన్‌సీసీ కేడెట్లతో అధికారులు, ఉపాధ్యాయులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్, ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లకు మంగళవారం 10(టీ) బెటాలియన్ చీఫ్ ఆఫీసర్ సర్టిఫికెట్లు అందజేశారు. పరేడ్, ఎన్‌సీసీ కోకరిక్యులర్‌తో పాటు పలు పరీక్షలు నెగ్గిన వారికి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హావల్దార్ విజయ్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బాబు, ఎన్‌సీసీ కేడెట్లు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం వర్ధన్నపేట పట్టణంలో సీఆర్పీఎఫ్ జవాన్లతో అంబేడ్కర్ సెంటర్ నుంచి వివేకానంద విగ్రహం, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి వరకు పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం వర్ధన్నపేట పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. వర్ధన్నపేట పట్టణంలోని పుస్కోస్ పాఠశాలలో పోలింగ్ బూత్‌ను పరిశీలించి అధికారులకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పదవీ విరమణ అభినందన సభ


పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్ జెడ్పీఎస్ఎస్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏప్రిల్, మే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం ఏనుగల్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉద్యోగ విరమణ సన్మాన సభ హెచ్‌ఎం గాయపు లింగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈనెలలో చింతనెక్కొండ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ జడల చంద్రశేఖరం, కాంప్లెక్స్ ఉపాధ్యాయులను సన్మానించారు. మే నెలలో విరమణ పొందుతున్న ఏనుగల్ ఉపాధ్యాయుడు కోమాకుల మల్లికార్జున్, లాలుతండా పాఠశాల ఎస్‌జీటీగా పని చేస్తున్న ఎడ్ల రవికుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా గాయపు లింగారెడ్డి మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారిలో కోట హైమావతి, డాక్టర్ బొమ్మెర కుమారస్వామి, తాటిపల్లి చైతన్య, చిదురాల సుదర్శన్, పాక శ్రీనివాస్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో నమోదు శాతం పెంచాలని, పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చి దిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, కూనూరి రమేష్, శ్రీధర్, మదిలీమాయే, రామస్వామి, సంపత్‌రావు, నాగేశ్వర్‌రావు, నర్సింహారావు, ఝాన్సీరాణి, రాణిరుద్రమ, జయ, రమేష్, కిషన్, ఎల్ల రాజు, మోసిన్ అబ్దుల్ కలాం, మనోహర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు


తండ్రి పాడె మోస్తున్న కూతుళ్లు

చెన్నారావుపేట : పున్నమా నరకం నుంచి పుత్రుడు కాపాడుతాడని.. అందుకే పుత్రుడు కావాలనేది పాత మాట.. కానీ కంటే కూతురినే కనాలిరా.. మనసుంటే మగడిలా పెంచాలిరా అనేది నేటి అక్షర సత్యం. తండ్రి కడుపున పుట్టిన నలుగురు కుమార్తెలు నాన్న మరణానంతరం పాడె మోసి తలకొరివి పెట్టి కన్నరుణం తీర్చుకున్నారు. చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన నల్లతీగెల రాములు(70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కాగా రాములుకు నలుగురు కుమార్తెలు స్వరూప, కోమల, రోజా, శాంత, భార్య లక్ష్మి ఉన్నారు. పెద్ద కుమార్తె స్వరూప తలకొరివి(కుండ) పట్టగా మిగిలిన మిగతా వారు పాడె మోస్తుండడం చూసిన వారు బోరున విలపించారు.